చేనేత రంగుల నుంచి
పదాల అల్లిక వరకు
- సినీ గేయ, రచయిత, కవి, వడ్డెపల్లి కృష్ణ మృతి
- సాహితీ రంగంలో తనదైన ముద్ర 8లో..



రావయ్యా.. గణపయ్యా

- వినాయక నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం
- సామాన్యులకు విగ్రహాలు ధరలు భారం
- ఉచితంగా మట్టి వినాయకుల పంపిణీ
- విభిన్నంగా మండపాల ఏర్పాటు
- జిల్లాలో దాదాపు 5 వేల విగ్రహాలు
- ఉత్సవాలకు భారీగా ఖర్చు
- పోలీసుల ప్రత్యేక నిఘా
- నేడు వినాయక చవితి

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఏ శుభ కార్యమైనా ముందుగా వినాయకుడి పూజతోనే ప్రారభమవుతుంది. అలాంటి ఏకదంతుడి పండుగంటే అందరికీ సంబరమే. శనివారం వినాయక చవితి సందర్భంగా ప్రారంభమయ్యే గణేష్ నవరాత్రి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా జరుపుకునేందుకు సర్వం సిద్ధం చేశారు. తొలిపూజలు అందుకునే గణపయ్యను కొలిచేందుకు పల్లె నుంచి పట్టణం వరకు వాడవాడనా మండపాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. తొమ్మిది రోజులపాటు పిల్లలు పెద్దలు ఎంతో నిష్టతో విఘ్నేశ్వరుడికి పూజలు నిర్వహించనున్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలకు జరుపుకోవడానికి యువత, నిర్వాహకులు పోటీ పడ్డారు. ఉత్సవాల కోసం ఖరీదైన మండపాలు, భారీ విగ్రహాలను ప్రతిష్ఠించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. విఘ్నాలు తొల గించే వాడిగా ఏ పని మొదలు పెట్టినా విఘ్నేశ్వరుడిని ధ్యానించడంతోనే మొదలయ్యే సంప్రదాయం భూలోకం లేనే కాదు.. దేవలోకంలోనూ ఉన్నట్లు చెబుతారు. వేదాలకు ఆది స్వరూపమైన 'ఓంకార' రూపమే గణపతిగా భావిస్తారు. పంచభూతాలకు సంకేతంగా వినాయకుడు పూజలు అందుకుంటాడు. దక్షిణాయానంలో తొలి పండుగగా వినాయక చవితిని జరుపుకుంటారు.

● బొజ్జ గణపయ్య ఖర్చు రూ.10 కోట్ల పైనే

జిల్లా వ్యాప్తంగా వినాయక నవరాత్రోత్సవాల ఖర్చు భారీగానే ఉంది. దాదాపు ఐదు వేల భారీ విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఉత్సవాల కోసం రూ.10 కోట్ల పైగానే నిర్వాహకులు ఖర్చు చేయనున్నారు. సిరిసిల్ల వేములవా డలోనే 3 వేల విగ్రహాల వరకు ప్రతిష్ఠిస్తే ప్రతీ గ్రామంలో ఐదు నుంచి పది వరకు ఏర్పాటు చేయనున్నారు. విగ్రహాల కోసం సంఘాలు రూ.45 వేల నుంచి 3 లక్షల వరకు ఖర్చు చేస్తున్నాయి. మండపాల కోసం అదనపు ఖర్చు కూడా ఉంటుంది. మహారాష్ట్ర, నాందేడ్‌తోపాటు హైదరాబాద్, ప్రాంతాల నుంచి విగ్రహాలను తీసుకొస్తు న్నారు. మట్టి విగ్రహాలను కూడా ప్రతిష్ఠించనున్నారు. ఈసారి విగ్రహాల ధరలు కూడా 20 శాతం వరకు పెరిగాయి. ఇళ్లలో కొలువుదీరనున్న చిన్న వినాయక విగ్రహాలను మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.వివిధ ఆకృతుల్లో ఉండే విగ్రహాలు రూ.300 నుంచి రూ.2 వేల వరకు ధర పలుకుతున్నాయి. మరోవైపు సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతోపాటు వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు మట్టి వినాయకులను పంపిణీ చేశాయి.



సిరిసిల్ల మార్కెట్లో విక్రయిస్తున్న వినాయక విగ్రహాలు

● పూజకు ఇలా సిద్ధం కావాలి..

వినాయకుని పూజ కోసం 21పత్రులను సిద్ధం చేసుకోవాలి. వాటితోపాటు పసుపు, కుంకుమ, అగర్‌వత్తులు, హారతి కర్పూరం, అక్షంతలు, దీప స్తంభాలు, కందులు, వత్తులు, నూనె లేక నెయ్యి, పంచామృతాలు, తమలపాకులు, వక్కలు, పూజ పుష్పాలు, పండ్లు, పత్రి, వ్రతం, యజ్ఞోపవితం, గందం, పంచపాత్ర, ఉద్దరీన, పల్లెములు, హారతి పల్లెం, కొబ్బరికాయలు, జెగంట, పాలవెల్లి, గొడుగు, నైవేద్యం సామాగ్రి, పిండివంటలు సిద్ధం చేసుకోవాలి. ఇంట్లో ఈశన్య ప్రాంతంలో తూర్పు ముఖంగా శుభ్రం చేసి అలికి ముగ్గులు పెట్టాలి. వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి ఉపయోగించే పీఠాన్ని లేదా మండపాన్ని పసుపు, కుంకుమలతో అలంకరించాలి. మండపంలో అష్టదల పద్మముగ్గు వేయాలి. వెదురు కర్రలతో పాలవిల్లి తయారు చేసి, వెలగ, మారేడు, మొక్కజొన్న కంకులు, జామ పండ్లు, అరటిపండ్లు, మామిడి ఆకులు, పూలతో పాలవెల్లిని అలంకరించాలి. అష్టదల పద్మంలో బియ్యం పోసి వినాయకున్ని ప్రతిష్టించాలి. దీపాన్ని వెలిగించాలి. అక్షింతలు ఉంచి కలశ పూజ చేయాలి. పసుపుతో చేసిన గణపతిని తమలపాకుపై ఉంచి పూజ చేయాలి. లోహవిగ్రహాలు ఉన్న మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవాలి. ఏర్పాటు చేసుకున్న సామగ్రితో పూజ నిర్వహించాలి.

● ఉత్సవాలపై పోలీసుల దృష్టి

జిల్లాలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగే విధంగా పోలీసులు ప్రత్యేక దృష్టిసారించారు. డీజేలకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. రాత్రి పది గంటల తరువాత సౌండ్ సిస్టమ్‌ను నిలిపివేసే విధంగా ఆదేశాలు ఇచ్చారు. మండపాల వివరాలను ఇప్పటికే సేకరించారు. వినాయక ఉత్సవాల ప్రారంభం నుంచి చివరి వరకు పర్యవేక్షించనున్నారు. ఇప్పటికే నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించారు. పలు సూచనలు చేశారు. నిమజ్జనం రోజున కూడా క్రమపద్ధతిలో వెళ్లడానికి ముందుగానే సీరియల్ నంబర్లను కేటాయిస్తున్నారు. సంప్రాదాయ పద్ధతిలో ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవడానికి సూచనలు చేస్తున్నారు. గణేష్ మండపాలను ప్రజారవాణా, ఎమర్జెన్సీ వాహనాలను ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలని, మండపాలు ఏర్పాటు చేసేవారు సంబంధిత శాఖల అనుమతి, విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాలని సూచించారు. మండపాల పూర్తి బాధ్యత నిర్వాహకులదేనని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. మండపాల వద్ద 24 గంటలు వలంటీర్లు ఉండే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని, డీజేలు కాకుండా చిన్న స్పీకర్‌లను పోలీసుల అనుమతితో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచనలు చేశారు.

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించాలి

● కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 6: ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించాలని, బాధితులకు సత్వర న్యాయం చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్సీ అధికారి విజయలక్ష్మీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న జిల్లాలో అమలవుతున్న పథకాలు, అభివృద్ధి పనులపై వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో విచారణ వేగంగా పూర్తి చేసి చార్జీషీట్‌ను వేస్తే బాధితులకు న్యాయంతోపాటు ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం అందుతుందన్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, అదనపు ఎస్పీ చంద్రయ్య, వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, సిరిసిల్ల ఆర్డీవో రమేష్, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాములు, గిరిజన సంక్షేమ శాఖ అధికారి జనార్దన్, కమిటీ సభ్యులు సుధాకర్, రాంచందర్, తిరుపతి, బాలయ్య, బాలరాజు, అలువాల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 6: ఎల్లారెడ్డిపేటలోని మహాత్మా జ్యోతీబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ బాలురు గురుకుల డిగ్రీ కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారి వీర ప్రభాకర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9వ తేదీ వరకు స్థానిక డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 7680051752, 7013147565 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించాలి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 6: అంగన్‌వాడీ కేంద్రాలలో పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించాలని, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం సూచించారు. పోషన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పొత్తూరు, వంతడుపుల, రేపాక, గొల్లపల్లి గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం శిశుసంక్షేమ శాఖపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పిల్లలకు సమతుల్య ఆహారం అందించడానికి కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు పిల్లలపై ప్రత్యేక దృష్టి నిలపాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రకళ తదితనేలే పాల్గొన్నారు.

కుండ పోత..

- వినాయక ఉత్సవ నిర్వాహకులకు ఇబ్బందులు

సిరిసిల్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పొద్దంతా ఎండ వేడితో, ఉక్కపోతతో ఉన్న వాతావరణం శుక్రవారం రాత్రి ఒక్కసారిగా కుండపోతగా వర్షం కురిసింది. వాతావరణం చల్లబడి ప్రజలకు ఊరట కలిగించినా వినాయక నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేసుకుంటున్న ఉత్సవ నిర్వహకులు ఇబ్బందులు పడ్డారు. శనివారం వినాయక చవితి సందర్భంగా గణపతి విగ్రహాలను విక్రయించడానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు వర్షంలోనే తడిసి అవస్థలు పడ్డారు. విగ్రహాలు పండుగ సామాగ్రి కొనుగోలుకు వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

వేములవాడ టౌన్, సెప్టెంబరు 6 : పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. వేములవాడలోని మైనార్టీ రెసిడెన్షియల్ విద్యాలయాన్ని శుక్రవారం తనిఖీ చేశారు ఈ సందర్భంగా విద్యాలయం ఆవరణ, తరగతి గదులు, టాయిలెట్స్, కిచెన్, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు పలు అంశాలపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యాలయం ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని విద్యా సంస్థల ఓఎస్డీ సర్వర్ మియాను ఆదేశించారు విద్యార్థులను మ్యాథ్స్ ,సైన్స్ ఇంగ్లీషులో రాణించేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులు





మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్లు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 6: మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం మున్సిపల్ కార్యాలయం ఎదుట కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో మున్సిపల్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. మట్టి వినాయక విగ్రహాలకు ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మున్సిపల్ కమిషనర్ మిర్జా ఫసహత్ అలీ బేగ్, కౌన్సిలర్లు రాజు, శ్రీనివాస్, నాగరాజు, సత్యనారాయణ, భాస్కర్, మాజీ కౌన్సిలర్ సందీప్, కృష్ణ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు పాల్గొన్నారు.

వేములవాడ: రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన మట్టి గణపతుల విగ్రహాలను మున్సిపల్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి, వైస్ చైర్మన్ బింగి మహేష్, కౌన్సిలర్ నరాల శేఖర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతులనే పూజిద్దామని పిలుపునిస్తూ స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యమివ్వాలి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 6: గ్రామాలలో పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మురుగునీటి కాలువలను తరచూ శుభ్రం చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి, సక్రమంగా విధులు నిర్వహించాలని సూచించారు. భారీవర్షాలతో జరిగిన నష్టాన్ని నివేదిక ద్వారా తెలుపాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీఓ శశికళ, ఎంపీవో వాజీద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ



జీవన్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఆర్టిజన్లు

సంస్థ ఉద్యోగులుగా గుర్తించాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఆర్టిజన్‌ల వినతి

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 6: ఎన్‌పీడీసీఎల్ సంస్థలో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమని శాఖ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ ఆర్టిజనల్ కార్మికులు జగిత్యాల పట్టణంలోని ఇందిరాభవన్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భం గా జీవనరెడ్డి మాట్లాడుతూ ఆర్టీజన్‌ల సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఏపీఈఎస్‌టీ రూల్స్ వర్తింపజేసేలా చొరవ చూపుతానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి ఆర్టిజన్‌ల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయడంతో పాటు, కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధనకు సీఎం సైతం చొరవచూపుతారని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఆర్టిజన్ కార్మికులు పాల్గొన్నారు.

ఉధృత గోదావరిని దాటలేక..

- తెలంగాణ భూభాగంలో నిలిచిపోయిన మావోయిస్టులు
- ఫెర్రీ పాయింట్ల వద్ద పోలీసులు, కూంబింగ్‌తో మూల్యం
- 2 నెలలుగా ములుగు, భద్రాద్రి ఏజెన్సీలో లచ్చన్న దళం
- ఈ క్రమంలోనే రఘునాథపాలెం ఘటన

హైదరాబాద్, చర్ల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో భద్రతా బలగాల నుంచి తప్పించుకునేందుకు తెలంగాణలోకి వచ్చిన మావోయిస్టులు.. ఇక్కడా గాలింపు తీవ్రం కావడంతో తిరిగివెళ్లే ప్రయత్నం చేశారు. కానీ.. గోదావరి ఉధృతి వారికి అడ్డుగా మారింది. ఫెర్రీ పాయింట్ల వద్ద పోలీస్ నిఘా, కూంబింగ్ ముమ్మరం చేయడంతో తప్పించుకునే మార్గం లేకపోయింది. ఈ క్రమంలోనే భద్రాది కొత్తగూడెం జిల్లా కరకగూడెం అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. ఛత్తీస్‌గఢ్‌లో బలగాల నుంచి తప్పించుకోవడంతోపాటు తెలంగాణలో పట్టు సాధించేందుకు వీరు వేసవిలో గోదావరి నది దాటి వచ్చారు. ఇప్పుడు అదే గోదావరిని అధిగమించలేక ప్రాణాలు కోల్పోయారు. కాగా, గురువారం నాటి ఎన్‌కౌంటర్‌లో భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు (బీకే-ఏఎస్‌ఆర్) డివిజన్ కమిటీ సభ్యులు ఆరుగురు మృతిచెందిన సంగతి తెలిసిందే. మణుగూరు లోకల్ గెరిల్లా స్క్వాడ్ (ఎల్జీఎస్) కార్యదర్శి వీరన్న అలియాస్ లచ్చన్న, ఆయన భార్య, మణుగూరు ఎల్జీఎస్ కమాండర్ పూనం లక్కె సహా మరో నలుగురు చనిపోయారు. లచ్చన్న నేతృత్వంలో దళం తెలంగాణలోకి మే నెలలోనే వచ్చింది. బలగాలకు చిక్కకుండా సంచరించింది. అయితే, తెలంగాణ పోలీస్‌లు వారి కదలికలను పక్కాగా పసిగట్టడంతో కరకగూడెం ఎన్‌కౌంటర్ జరిగింది. మరోవైపు ఈ ఏడాది 6 నెలల్లో మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో 100 మందిపైగా మృతి చెందారు. 300 మంది లొంగిపోయారు. 250 మంది వరకు అరెస్టయ్యారు. ఛత్తీస్‌గఢ్‌లో కొంత కాలంగా భద్రతా బలగాలు 'ఆపరేషన్ కగార్' పేరుతో దాడులు చేస్తున్నాయి. ఇటు ఒడిసా, తెలంగాణ, ఏపీలోనూ కట్టుదిట్టం చేయడంతో మావోయిస్టులు తప్పించుకునే వీల్లేకపోతోంది. కేంద్ర హోం శాఖ ఆదేశాలతో అన్ని రాష్ట్రాల పోలీస్‌లు కూంబింగ్‌లతో మావోయిస్టుల స్థావరాలకు చేరువవుతుండడంతో అగ్రనేతలు సురక్షిత స్థావరాల కోసం చూస్తున్నారు. నారాయణపూర్, బీజాపూర్, కాంకేర్ నుంచి కీలక నేతలు మహారాష్ట్ర, ఒడిశా, జార్ఖండ్‌తో పాటు తెలంగాణ వైపు వచ్చారన్న సమాచారంతో పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. కేంద్ర కమిటీలో చాలామంది వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు.

ఇబ్బందికరంగా మారిన విభేదాలు

తెలుగు రాష్ట్రాలకు చెందిన నీల్సోను ఇన్‌ఫార్మర్ నెపంతో హతమార్చాక.. మావోయిస్టు పార్టీలో ఎన్నడూ లేని విధంగా విభేదాలు తీవ్రమైనట్లు సమాచారం. దళంలో ఎవరు ఇన్‌ఫార్మర్, ఎవరు కాదు అన్న విషయంలో సందేహాలు నెలకొన్నాయి. రఘునాథపాలెం ఎన్‌కౌంటర్ సైతం ద్రోహులు ఇచ్చిన సమాచారంతోనే జరిగిందని పార్టీ ప్రకటించింది. తెలంగాణ- ఏపీ కేడర్‌లోనే కోవర్టులు ఎక్కువగా ఉన్నారన్న ప్రచారం ఉంది. అందుకే, వీరిని హిడ్మా తమ గ్రూప్‌తో దూరంగా ఉంచుతున్నారని తెలిసింది. కొద్ది రోజుల కిందట హిడ్మా బెటాలియన్ కేడర్లు కేంద్ర కమిటీ సభ్యుడైన చంద్రన్న టెంట్‌పై రాత్రివేళ దాడి చేసినట్లు సమాచారం. ఓవైపు పోలీసు క్యాంపులు, ఎన్‌కౌంటర్లు, మరోవైపు కేడర్ దూరం అవుతుండడం పార్టీని ఇరకాటంలో నెట్టేస్తున్నాయి.

తెలంగాణలో అడుగుపెట్టనివ్వం - డీజీపీ జితేందర్

తెలంగాణలో మావోయిస్టులకు స్థానం లేదని, రాష్ట్రంలో వారు అడుగు పెట్టకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని డీజీపీ జితేందర్ తెలిపారు. జనజీవన స్రవంతిలో కలిసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే పునరావాసం, ఆర్థిక సాయంతో సాధారణ జీవితం కొనసాగించాలన్నారు. గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో పెద్ద మొత్తంలో ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జ్వరంతో మహిళ మృతి

రుద్రంగి, సెప్టెంబరు 6 : రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రానికి చెందిన చలిగటి లక్ష్మి (50) జ్వరంతో శుక్రవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. రుద్రంగికి చెందిన లక్ష్మి వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతోంది. ఇంటి వద్ద చికిత్స పొందినా జ్వరం తగ్గకపోవడంతో స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రిలో రెండు రోజులు చికిత్స పొందింది. అక్కడ ప్లేట్‌లెట్స్ తగ్గడం, పరిస్థితి విష మించడంతో శుక్రవారం సాయంత్రం వేములవాడలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో చేరిన వెంటనే లక్ష్మి మృతి చెందింది. లక్ష్మికి కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఒకరికి మూడేళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 6:బాలికపై లైంగిక దాడికి పాల్పడిన చీపెల్లి మల్లయ్యకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ సిరిసిల్ల జిల్లా జడ్జి ఎన్.ప్రేమలత శుక్రవారం తీర్పు వెల్లడించారని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఇల్లంతకుంట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు నిందితుడు చీపెల్లి మల్లయ్య డిసెంబరు 25, 2018న మాయ మాటలు చెప్పి తన ఇంటికి తీసుకెళ్లి లైంగికంగా వేధించాడని తెలిపారు. ఈ సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై చంద్రశేఖర్ కేసు నమోదు చేసి మల్లయ్యను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. అనంతరం కోర్టులో ప్రవేశపెట్టగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన జిల్లా జడ్జి ప్రేమలత మూడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

బాండ్స్ డబ్బులు చెల్లింపుపై హర్షం

భగత్‌నగర్, సెప్టెంబరు 6: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పీఆర్‌సీ- 2013 బాండ్స్ డబ్బులను కండక్టర్స్‌కు చెల్లించడంపై జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్‌చైర్మన్ ఎం థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎండి మౌలానా, కో-కన్వీనర్ కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి యాద్‌లు ఒక ప్రకటనలో హర్షం ప్రకటించారు. దసరా పండుగకు బాండ్ డబ్బులు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. దీనితో పాటు గ్యారేజ్‌సిబ్బంది, వర్క్ షాపు సిబ్బంది, సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది, మెడికల్ సిబ్బంది ఉద్యోగులకు బాండ్ డబ్బులు చెల్లించాలని జేఏసీ పక్షాన డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మెట్‌పల్లి, సెప్టెంబరు 6 (ఇబ్రహీంపట్నం): మెట్‌పల్లి పట్టణంలోని ఆర్మూర్ రోడ్డులో అతి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు మహిళను ఢీకొట్టగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. పట్టణంలోని డీడీనగర్ కాలనీకి చెందిన నలివేని ఎల్లమ్మ (43) ఈ నెల 2న మెట్‌పల్లి నుంచి ఆర్మూర్‌కు వెళ్లే రోడ్డులో మనోహర గార్డెన్స్ ఎదుట రాత్రి 10.30 సమయంలో రోడ్డు దాటుతుండగా అతి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో హుటాహుటిన చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. మెట్‌పల్లి పోలీసులు ఆర్టీసీ డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాయిల్డ్ రైస్‌మిల్లు నిర్మాణానికి అనుమతులు ఇవ్వొద్దు

- తహసీల్దార్, ఎంపీడీవోలకు వెంగళాపూర్ గ్రామస్థుల వినతి

గొల్లపల్లి, సెప్టెంబరు 6: ఇప్పటివరకు స్వచ్ఛంగా ఉన్న తమ గ్రామంలో కొందరు వ్యక్తులు బాయిల్డ్ రైస్‌మిల్లు నిర్మించి గ్రామాన్ని కలుషితం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారని, రైస్ మిల్లు నిర్మాణానికి ఎట్టి పరిస్థితుల్లో అనుమతులు ఇవ్వొద్దంటూ మండలంలోని వెంగళాపూర్ గ్రామస్థులు తహసీల్దార్ జమీర్, ఎంపీడీవో రాంరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. శుక్రవారం గ్రామానికి చెందిన పలువురు గొల్లపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చి ఆయా శాఖల అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఇద్దరు, లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మరో ముగ్గురు వ్యక్తులు కలిసి గ్రామానికి పై భాగాన సుమారు 800 మీటర్ల దూరంలో బాయిల్డ్ రైస్‌మిల్లును నిర్మించడానికి ఏర్పాట్లు చేస్తున్నారని అన్నారు. ఈ నిర్మాణం సమీపంలో గ్రామానికి చెందిన మంచినీటి బావితో పాటు ప్రాథమిక పాఠశాల ఉందని, దీనివల్ల గ్రామంలో వాతావరణ కాలుష్యంతో పాటు పొగ, నల్లని బూడిద రావడంతో అనారోగ్యాలపాలవుతామని భయాందోళన వ్యక్తం చేశారు. గ్రామస్థుల అభీష్టానికి వ్యతిరేకంగా రైస్‌మిల్లు నిర్మాణానికి అనుమతులు ఇస్తే ఊరుకునేది లేదని, దేనికైనా తెగిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు గ్రామానికి సహకరించి రైస్‌మిల్లు నిర్మాణానికి అనుమతులు ఇవ్వొద్దని, గ్రామాన్ని కాపాడాలని సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగారెడ్డి, రాజేందర్, హన్మయ్య పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు

కొడిమ్యాల, సెప్టెంబరు 6 : మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం తహసీల్దారు విధులకు ఉదేశ పూర్వకంగా ఆటంకం కలిగించిన అయిత శ్రీనివాస్, అయిత గణేష్‌పై తహసీల్దారు బి. రాజమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు... నిందితులు పురుగుల మందు డబ్బాతో కర్రను చూపుతూ తహసీల్దారు డౌన్‌డౌన్ అని స్టిక్కర్లను చూపారన్నారు. తమ భూమిని సర్వే చేయించాలని డిమాండ్ చేశారన్నారు. పురుగుల మందు తాగి మరణిస్తామని ప్రజల సమక్షంలో విధులకు ఆటంకం కలిగించారని తహసీల్దారు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీసీ రాజ్యాధికార సమితి అడ్‌హక్ కమిటీల నియామకం

బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి గడప కోటేశ్ కుమార్

గణేశ్‌నగర్,సెప్టెంబరు 6: త్వరలో తెలంగాణ రాష్ట్ర బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా, నియోజకవర్గ, మండల అడ్‌హక్ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు బీసీ రాజ్యాధి కార సమితి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గడప కోటేశ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీసీల సమస్య ల ప్రధాన ఎజెండాగా బీసీ రాజ్యాధికార సమితి నిరంతరం అనేక పోరాటాలు నిర్వహిస్తుందని బీసీ లకు చట్టసభలలో రిజర్వేషన్ కల్పించడమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తుందన్నారు. బీసీల సమస్యల పై పోరాడే నాయకులు ముందుకు వచ్చి బీసీ రాజ్యాధికార సమితిలో పనిచేయాలని పిలుపు నిచ్చారు. స్థానిక సంస్థలలో పోటీ చేసే నాయకులు బీసీ రాజ్యాధికారి సమితిలో భాగస్వామ్యం కావాలని తెలిపారు.

ట్రాన్స్ ఫార్మర్ పైనుంచి పడి లైన్‌మన్‌కు గాయాలు

చందుర్తి, సెప్టెంబరు 6: చందుర్తి మండల కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మ చేస్తున్న లైన్‌మన్ శుక్రవారం పైనుంచి కింద పడడంతో గాయపడ్డాడు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌పై లైన్‌మన్ కొత్త తిరుపతిరెడ్డి మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. తిరుపతిరెడ్డికి స్థానికంగా ప్రథమ చికిత్స చేయించారు.

పందివాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలి

చొప్పదండి, సెప్టెంబరు 6: మండలంలోని ఆర్నకొండ రాగంపేట మధ్యలో ఉన్న పందివాగుపై హైలెవెల్ వంతెనను నిర్మించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. చొప్పదండిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆర్నకొండ నుంచి రాగంపేట వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతి న్నదని చెప్పారు. ఆర్నకొండ గోపాలరావుపేట రోడ్డు ధ్వంసమైందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. చిన్నపాటి వర్షానికి సైతం రాగంపేట నుంచి గోపాల్‌రావుపేట వరకు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం పందివాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని ఆయన కోరారు.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	50,350	7,882	80.5	76.894
ఎల్లంపల్లి	15,719	---	20.175	19.202
మిడ్ మానేరు	3,216	6,400	27.54	23.144
ఎల్ఎండీ	11,406	294	24.034	20.268

శ్రీరాంసాగర్‌కు 42,740 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



జలకళను సంతరించుకున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి శుక్రవారం ఇన్‌ఫ్లో వస్తోంది. ఎస్సారెస్పీలోకి 50,350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 76.8 94 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతర అవసరాలకు ఏడు వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

శ్రీపాద ఎల్లంపల్లి గేట్లు మూసివేత

పెద్దపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో అధికారులు వరద గేట్లను మూసివేశారు. శుక్రవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 15,719 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఇందులో కడెం ప్రాజెక్టు నుంచి 3841 క్యూసెక్కులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 11,878 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 19.202 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

మిడ్ మానేరుకు 3,216 క్యూసెక్కులు రాక

బోయినపల్లి, సెప్టెంబరు 6: మిడ్ మానేరుకు ఎస్సారెస్పీ నుంచి 2,200 వేలు మూలవాగు, మానేరు వాగు ద్వారా 1,016 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. అన్నపూర్ణ రిజర్వా యర్‌కు 6400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 318. మీటర్లకు ప్రస్తుతం 316.215 ఉండగా, నీటి నిల్వ సామ ర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 23.144 టీఎంసీల మేర చేరుకుంది.

ఎల్ఎండీకి తగ్గిన ఇన్‌ఫ్లో



ఎల్ఎండీలో ఉన్న నీటి నిల్వలు

తిమ్మాపూర్, సెప్టెంబరు6: కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లోలు తగ్గాయి. ఎల్ఎండీలోకి ప్రస్తుతం మోయతుమ్మెద వాగు నుంచి 9,856 క్యూసెక్కులు, ఎగువ ఎల్ఎండీ నుంచి 1,550క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. మొత్తం 11,406 క్యూసెక్కుల నీరు ఎల్ఎండీ లోకి వచ్చి చేరుతోంది. అవుట్ ఫ్లో 294 క్యూసెక్కులు ఉంది. పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 20.268 టీఎంసీలకు చేరుకున్నది.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 6: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,550 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు ఏడుగురు రైతులు 95క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,550, కనిష్ఠ ధర 7,300 రూపాయలు చెల్లించారు.

వినియోగదారులు మీటర్ కనెక్షన్ తీసుకోవాలి

సైదాపూర్, సెప్టెంబరు 6: విద్యుత్ వినియోగదారులు మీటర్ కనెక్షన్ తీసుకొని కరెంటు వాడుకోవాలని కరీంనగర్ ఎస్ఈ వి గంగాధర్ అన్నారు. గొడిశాల గ్రామంలో విద్యుత్‌శాఖ నిర్వహిస్తున్న నూతన కరెంటు మీటర్ల దరఖాస్తుల కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. వినియోగదారులకు తగు సూచనలు చేశారు. 500ల వోల్టేజ్ లోడు లోపు కరెంటు కనెక్షన్ కోసం రూ. 938 చెల్లించాలని చెప్పారు. గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల వరకు జీరో బిల్లు నమోదు అవకాశాన్ని తెల్ల రేషన్‌కార్డు కలిగిన వారందరు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హుజూరాబాద్ డీఈ లక్ష్మారెడ్డి, ఏఈ బొమ్మ ఆంజనేయులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు సబ్ జూనియర్ ఖోఖో జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 6: జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల ఖోఖో జట్ల ఎంపిక పోటీలను ఆదివారం నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని అసోసియేషన్ ప్రధానకార్యదర్శి వై మహేందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నామని చెప్పారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఇండెక్స్ మొత్తం 215 పాయింట్లలోపు ఉండాలని తెలిపారు.

ధాన్యం టెండర్ల పరిశీలన

- రామగుండం సెక్టార్‌కు ఒకటే టెండర్
- సద్దుమణిగిన కాంట్రాక్టర్ల మధ్య వివాదం
- మాట్లాడిన అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్



మాట్లాడుతున్న అదనపు జేసీ శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వానాకాలం, యాసంగి సీజన్లలో ధాన్యం రవాణా చేసేందుకు దాఖలైన టెండర్లను అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ తెరిచారు. టెండర్ల దాఖలకు ఈనెల 5వ తేదీ చివరి తేదీ కాగా, పెద్దపల్లి సెక్టార్‌కు ఒకటి, సుల్తానాబాద్ సెక్టార్‌కు 2, మంథని సెక్టార్‌కు 2, రామగుండం సెక్టార్‌కు ఒక టెండర్ దాఖలయ్యింది. ఆ టెండర్లను అదనపు కలెక్టర్ కాంట్రాక్టర్ల సమక్షంలో తెరిచి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెండర్లలో తక్కువ ధర కోట్ చేసిన వారిని ఈనెల 9వ తేదీన పిలుస్తామని చెప్పారు. గురువారం టెండర్ల సందర్భంగా రామగుండం సెక్టార్‌కు లక్ష్మన్ కుమార్ కాంట్రాక్టర్ దాఖలు చేసిన టెండర్ ఫారాన్ని రామగుండం లారీ ట్రాన్స్‌పోర్ట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పలువురు లాక్కొవడంతో ఇరు వర్గాల మధ్య వివాదం తలెత్తి ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో టెండర్ ఫారాన్ని లాక్కువెళ్లిన వారిపై స్థానిక పోలీసులకు పౌరసరఫరాల సంస్థల జిల్లా మేనేజర్ ముప్పిడి శ్రీకాంత్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు మరొక సెట్ అందజేయాలని లక్ష్మన్‌కుమార్‌కు అవకాశం కల్పించారు. టెండర్లు తెరిచే సమయానికి లక్ష్మన్ కుమార్ మరొక సెట్ దాఖలు చేయలేదు. ఆయనకు మొదట మద్దతుగా నిలిచిన పాలకుర్తి లారీ అసోసియేషన్‌కు చెందిన వాళ్లు రామగుండం లారీ అసోసియేషన్ వాళ్లతో కాంప్రమైజ్ అయ్యారు. ఈ వ్యవహారంలో అధికార పార్టీకి చెందిన రామగుండం నియోజకవర్గ నేత జోక్యం చేసుకోవడంతో వివాదం సద్దుమణిగిందని సమాచారం.

ఇంట్లోకి వెళ్లిన కోతులు

- గడియ పడడంతో కిటికీ ఊచలు తొలగించిన యజమాని



ఇంటిపై ఉన్న కోతులు(ఇన్‌సెట్‌లో ఇంట్లోకి దూరిన వానరం)

రామడుగు, సెప్టెంబరు 6: మండల కేంద్రంలోని ఓ ఇంట్లోకి రెండు కోతులు ప్రవేశించాయి. అనంతరం తలుపులకు గడియ పడిపోవడంతో బయటకు రాలేకపోయాయి. ఆగ్రహంతో ఇంట్లో ఉన్న సామగ్రిని చిందరవందర చేశాయి. సుమారు నాలుగు గంటల పాటు కోతులు ఇంట్లోనే ఉండిపోయాయి. గమనించిన ఇంటి యాజమాని కిటికీ ఊచలను తొలగిం చడంతో కోతులు అక్కడి నుంచి బయటకు వెళ్లిపోయాయి. తీవ్ర ఆగ్రహంతో ఉన్న కోతులు తమను పై దాడి చేయకుండా కొబ్బరి చిప్పలు, అరిటి పండ్లు పెట్టడంతో వాటిని తీసుకొని బయటకు పరిగెత్తాయి. కాగా మండల కేంద్రంలో వానర సైన్యం బెంబెలెత్తించింది. పెద్ద సంఖ్యలో ఇళ్ల పరిసరాల్లో తిష్ఠ వేసి హంగామా సృష్టిస్తున్నాయి. ఇళ్లపైకి ఎక్కి పెంకులను తొలగిస్తున్నాయి. ఇళ్లల్లో ప్రవేశించి ఆహార వస్తువులు చిందరవందర చేస్తున్నాయి. అధికారులు కోతుల బెడదను తప్పించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు

రామడుగు, సెప్టెంబరు 6: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడామైదానంలో శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సబ్ జూనియర్ బాలుర అండర్-15 హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు ప్రారంభించారు. ఈ పోటీలకు గోపాల్‌రావుపేట, కోహెడ, సిరిసిల్ల, కరీంనగర్, కోరుట్ల, జగిత్యాల, వెలిచాల, కొత్తపల్లి, గంగాధర, పెద్దపల్లి, జమ్మికుంట, హుస్నాబాద్, కాటారం ప్రాంతాల నుంచి సుమారు 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్, హెచ్ఎం పద్మజ, పీహెచ్ఎస్ హెచ్ఎం రత్నాకర్ రెడ్డి మొదట క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.జిల్లా జట్టుకు ఎంపికైన ఆటగాళ్లు ఈ నెల 14,15వ తేదీల్లో హనుమకొండ జిల్లాలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీడీ స్వరూపరాణి, జిల్లా సంయుక్త కార్యదర్శి నమిలకొండ ప్రభాకర్, కాటారం కోచ్ మాల వెంకటేష్, సిరిసిల్ల జిల్లా కన్వీనర్ ప్రేమ్‌కుమార్, పీడీ హను, పీఈటీలు అమర్, సాయి, శివాజి, శ్రీకాంత్, కవిత, కనకలక్ష్మి, రాకేష్, సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

24 గంటలు 23 ఆపరేషన్లు

- వేములవాడ సర్కారు ఆస్పత్రిలో మరో రికార్డు

వేములవాడ టౌన్, సెప్టెంబరు 6: ప్రభుత్వాస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందుతాయని పేద ప్రజల్లో నమ్మకం కలిగించే దిశగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ప్రభుత్వ అనుపత్రి డాక్టర్లు, వైద్య సిబ్బంది కృషి చేస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ఆపరేషన్లు చేస్తూ రికార్డులు నెలకొల్పుతున్నారు. గత నెల 24వ తేదీన 24 గంటల్లో 17 వివిధ రకాల ఆపరేషన్లు చేసి ఆదర్శంగా నిలిచారు. తాజాగా గురువారం నుంచి శుక్రవారం వరకు వేములవాడ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది 24 గంటల్లో 23 వివిధ రకాల ఆపరేషన్లు చేశారు. వాటిలో పది సీజేరియన్ డెలివరీలు, రెండు గర్భసంచిలో గడ్డలు, ఐదు సాధారణ శస్త్ర చికిత్సలు, ఒకటి కంటి, ఐదు ఆర్థో ఆపరేషన్లు ఉన్నాయి. సూపరింటెండెంట్, సర్జన్ డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ సంధ్య, డాక్టర్ రత్నమాల, డాక్టర్ అనిల్, డాక్టర్ రాజశ్రీ, డాక్టర్ తిరుపతి ఇతర సిబ్బంది ఆపరేషన్లు చేసి ఏరియా ఆస్పత్రిపై నమ్మకాన్ని పెంచారు. 24 గంటల్లో 23 వివిధ రకాల ఆపరేషన్లు చేసిన సందర్భంగా డాక్టర్లు, వైద్య సిబ్బందిని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అభినందించారు.

వర్గీకరణ సదస్సుకు తరలిరావాలి

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 6: ఎస్సీ ఉప కులాల వర్గీకరణ సదస్సుకు కులస్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం హుజూరాబాద్ నియోజక వర్గ ఇన్‌చార్జి రాచపల్లి సాగర్ కోరారు. జమ్మికుంటలో శుక్రవారం చలో కరీంనగర్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌లోని పద్మనగర్‌లో గల ఓ ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 10న నిర్వహించనున్న ఎస్సీ ఉప కులాల వర్గీకరణ సదస్సుకు మాదిగ ఉప కులాలు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో షైన సాంబయ్య, రాచపల్లి వంశీకుమార్, పుల్యాల నరేష్, పోడేటి వేణు, సలిగంటి సతీష్, వడ్లూరి అరుణ్, కొలుగూరి రవీందర్, శనిగరపు యుగేందర్, దొగ్గల రవీందరర్, తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రవి, కిష్టయ్య, శంకర్, భాస్కర్, రాజయ్య, ఓదెలు, శ్రీనివాస్, సతీష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ భర్త అరెస్టు

- 14 రోజుల రిమాండ్
- జైలుకు తరలింపు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 6: మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో దురుసుగా ప్రవర్తించి, దుర్భాషలాడినందుకు కాంగ్రెస్‌పార్టీ నాయకుడు, కార్పొరేటర్ భర్త మెండి చంద్రశేఖర్‌ను అరెస్టు చేసి కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించామని కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ సరిలాల్ తెలిపారు. గురువారం సాయంత్రం ఆరు గంటల సమయంలో కరీంనగర్ మున్సిపల్ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ చాంబర్‌లోకి అనుమతి లేకుండా ప్రవేశించిన మెండి చంద్రశేకర్ ఓ ఫైల్ గురించి అడుగుతూ తనను చేతులతో కొట్టి దుర్భాషలాడి, చంపేస్తానంటూ అసభ్యంగా ప్రవర్తించాడని టీపీఎస్ తేజశ్విని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తను ఫైల్‌ను తీస్తుండగా తన నుంచి బలవంతంగా ఫైల్ తీసుకుని కమిషనర్ చాంబర్‌లోకి వెళ్లాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. తాను కమిషనర్ చాంబర్‌లోకి వెళ్లగా తనను వెంబడించిన కార్పొరేటర్ భర్త మెండి చంద్రశేఖర్ కమిషనర్‌ను కూడా దుర్భాషలాడాడని, విధులను ఆటంకించడంతో పాటు తమపై ఎస్సీ, ఎస్టీ కేసు పెడతానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు టీపీఎస్ తేజశ్విని ఇచ్చిన ఫిర్యాదుతో గురువారం రాత్రి కేసు నమోదు చేసిన పోలీసులు అర్ధరాత్రి సమయంలో ఆయనను అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. శుక్రవారం కరీంనగర్ కోర్టులో హాజరుపరచగా జడ్జి 14 రోజులు రిమాండ్ విధించడంతో జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఇద్దరికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 6 : విద్యుత్ చౌర్యం చేస్తూ ట్రాన్స్‌కో విజిలెన్స్ పోలీసులకు పట్టుబడిన రెండు వేర్వేరు కేసుల్లో ఇద్దరికి జైలుశిక్ష, జరిమానా పడిందని కరీంనగర్ ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ ఎండీ షాదుల్లా బాబా తెలిపారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గుంపుల గ్రామానికి చెందిన మలగల సదానందం అలియాస్ ఆరెపల్లి సదయ్యకు విద్యుత్ చౌర్యం కేసులో పెద్దపల్లి జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి డి హేమంత్ తీర్పు వెలువరిస్తూ 15,169 రూపాయల జరిమానా లేదా మూడు నెలల సాధారణ జైలుశిక్ష విధించారని సీఐ తెలిపారు. అలాగే చొప్పదండి మండలం మల్లన్నపల్లి గ్రామపరిధిలోని కాట్నపల్లికి చెందిన బండారి యాదగిరికి విద్యుత్ చౌర్యం కేసులో కరీంనగర్ జిల్లా ఉవ అదనపు సెషన్స్ జడ్జి డి వెంకటేష్ తీర్పు వెలువరిస్తూ 4,371 రూపాయల జరిమానా లేదా ఒక నెల సాధారణ జైలు శిక్షను విధించారని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రాయికల్, సెప్టెంబరు 6: మండలంలోని ఒడ్డెలింగాపూర్-భూపతిపూర్ మార్గ మధ్యలో శుక్రవారం కిష్టంపేట గ్రామానికి చెందిన దానవేణి పోచయ్య ద్విచక్ర వాహనం పై నుంచి కిందపడి గాయాలపాలయ్యాడు. అటువగా వెళ్తున్న యువకులు జక్కుల సాగర్, బందెల స్వామి, నలువాల రాములు 108కు సమాచారం ఇవ్వగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ప్రేమ, పెళ్లి పేరుతో మోసం

- నిందితుడిపై కేసు, రిమాండ్‌కు తరలింపు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 6: ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి 3 సంవత్సరాలుగా శారీరకంగా కలిసి, రెండు సార్లు అబార్షన్ కూడా చేయించి చివరకు మోసం చేసిన ఘటనపై కరీంనగర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం... కరీంనగర్ రూరల్ మండలానికి చెందిన ఒక యువతి (23)ని అదే గ్రామానికి చెందిన సూరజ్‌కుమార్ అనే యువకుడు ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా కలిశాడు. రెండు మార్లు 6 నెలల గర్భాన్ని తొలగింపజేశాడు. చివరకు పెళ్లి ప్రస్తావన తేవటంతో మొహం చాటేసి వివాహం చేసుకోనని చెప్పా డు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడు సూరజ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

క్రైం వార్తలు

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

తిమ్మాపూర్, సెప్టెంబరు 6: మండలంలోని నల్లగొండ గ్రామంలో ఓ యువకుడు అప్పుల బాధతో శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎల్ఎండి ఎస్సై వివేక్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ గ్రామానికి చెందిన నర్రేంకుల నరేష్(35)కు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. నరేష్ తన ఇంటి అవసరాల నిమిత్తం హిందుస్థాన్ మైక్రో ఫైనాన్స్ అనే సంస్థలో ఐదు లక్షల రూపాయలు హౌసింగ్ లోన్ తీసుకున్నాడు. తీసుకున్న లోన్ తీర్చలేక ఇబ్బందులు పడుతున్న నరేష్ శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లాడు. గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలోని చెట్టుకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నరేష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివేక్ తెలిపారు.

ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ దాడులు

మానకొండూర్/ కరీంనగర్ క్రైం సెప్టెంబరు 6: మండలంలోని నిజాయితీ గూడెం గ్రామంలో శుక్రవారం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడులలో మూడు లీటర్ల నాటు సారా, 400 లీటర్ల నాటు సారాను తయారు చేసేందుకు ఉపమోగించే బెల్లం పానకం, 60కిలోల నల్ల బెల్లం, ఐకిలోల పటిక స్వాధీనం చేసుకున్నారు. కేశవపట్నం గ్రామానికి చెందిన కల్లూరి ఐలయ్యపై కేసు నమోదు చేశారు. దాడుల్లో సీఐ నాగేశ్వర్‌రావు, హెడ్ కానిస్టేబుల్ మోసీన్, ఖాసీం, కమలాకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వర్‌రావు

వరద కాలువలో మృతదేహం లభ్యం

గంగాధర, సెప్టెంబరు 6: గంగాధర మండలం ర్యాలపల్లి సమీపంలోని వరద కాలువలో అనుమానాస్పద స్థితిలో మృతదేహం గుర్తించినట్లు ఏఎస్ఐ రమణారెడ్డి తెలిపారు. ర్యాలపల్లి సమీపంలో వరద కాలువలో వ్యవసాయ పంపు సెట్టుకు మృతదేహం తట్టుకుని ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా గుర్తుపట్టలేని స్థితిలో యువకుడు మృతి చెంది ఉన్నట్లు ఏఎస్ఐ తెలిపారు. కాలువ నుంచి శవాన్ని బయటకు తీశామని, అతని దుస్తుల్లో లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా మెట్‌పల్లికి చెందిన బొట్ల శ్రీనివాస్(35)గా గుర్తించామని తెలిపారు. ఇప్పటి వరకు శ్రీనివాస్ బంధువుల ఆచూకీ దొరకలేదని ఏఎస్ఐ చెప్పారు. వివరాలు తెలుసుకున్న అనంతరం పోస్టుమార్టం వరదకాలువ వద్దే నిర్వహించి మృతదేహాన్ని అప్పగిస్తామని ఏఎస్ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

రాయికల్, సెప్టెంబరు 6: మండలంలోని ఉప్పుమడుగు గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం రాయికల్ పోలీసులు పట్టుకున్నారు. నిర్మల్ పట్టణానికి చెందిన షేక్ అల్మాస్, షేక్ హైదర్‌లు మహేంద్ర బొలెరో వాహనంలో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా పట్టుకున్న వాహనంతో పాటు 30 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఇల్లంతకుంట: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. రేషన్ బియ్య ం తరలిస్తున్నారనే సమాచారం మేరకు శుక్రవారం పొత్తూరు గ్రామంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. కరీంనగర్ జిల్లా రేకుర్తికి చెందిన పత్తి కళ్యాణ్ ఆటోలో బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. ఐదు క్వింటాళ్ల బియ్యంతోపాటు ఆటోను సీజ్ చేశారు.



ఉప్పుమడుగు గ్రామంలో పట్టుకున్న రేషన్ బియ్యం

ఆర్ఎఫ్‌సీఎల్ నిర్లక్ష్యం

» మున్సిపల్ మురుగుకాల్వల్లోకి కెమికల్ వాటర్ » అమ్మోనియా వాసనతో గోదావరిఖని జనం అవస్థలు



ఆర్ఎఫ్‌సీఎల్ అవుట్ లెట్ నుంచి 7ఎల్ఈపీ డ్రైన్‌కు వస్తున్న వాటర్

కోల్‌సిటీ, సెప్టెంబరు 6: ఆర్ఎఫ్‌సీఎల్ సంస్థ తన నిర్లక్ష్యాన్ని మరోమారు చాటుకుంది. కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాల ప్రకారం కెమికల్ వాటర్‌ను శుద్ధి చేయకుండానే గోదావరిలోకి వదులుతున్న యాజమాన్యం ఇప్పుడు కెమికల్ వాటర్‌ను మున్సిపల్ మురుగు కాల్వలోకి వదిలింది. గోదావరిఖని 7ఎల్ఈపీ, సంజయ్‌గాంధీనగర్ నాలాలకు కెమికల్ వాటర్‌వదిలారు. స్థానిక 7ఎల్ఈపీ గని పక్కనే ఉన్న పాత గ్లోబల్ వాషరీస్ వద్ద గల ఆర్ఎఫ్‌సీఎల్ అవుట్‌లెట్ నుంచి, సంజయ్‌గాంధీనగర్ అవుట్‌లెట్ నుంచి శుక్రవారం రాత్రి 8గంటలకు పెద్ద ఎత్తున కెమికల్ వాటర్‌ను వదిలారు. దీంతో 7ఎల్ఈపీ కాలనీ, విఠల్‌నగర్, ఫైవింక్లయిన్ ఏరియా పరిధిలోని మూడు డివిజన్ల ప్రజలు అతలాకుతలం అయ్యారు. సంజయ్‌గాంధీనగర్, ఒరియా కాలనీ, ఎన్‌టీఆర్‌నగర్, కాకతీయనగర్, కళ్యాణ్‌నగర్, ఉల్లిగడ్డల బజార్, గోదావరిఖని మార్కెట్ ఏరియా, సీతానగర్, లెనిన్‌నగర్ వాసులు వాసనతో ఉక్కిరిబిక్కిరయ్యారు. వాటర్ నుంచి అమ్మోనియా గాలిలో కలుస్తుండడంతో కళ్లమంటలతో ఇబ్బందులు పడ్డారు. జనం ముఖానికి గుడ్డలు కట్టుకున్నారు. ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు కలెక్టర్ శ్రీహర్షకు, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆర్ఎఫ్‌సీఎల్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆదేశంతో కమిషనర్ శ్రీకాంత్ డ్రైన్ల అవుట్ లెట్ ఉన్న ప్రాంతాలను పరిశీలించారు.

ఆర్ఎఫ్‌సీఎల్ సంస్థపై క్రిమినల్ చర్యలు

ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆర్ఎఫ్‌సీఎల్ సంస్థపై ప్రజల పక్షాన క్రిమినల్ చర్యలకు వెనుకాడేది లేదు. వందల కోట్లు లాభాలు గడిస్తున్నా కనీసం రక్షణ ప్రమాణాలు పాటించడం లేదు. నిర్లక్ష్యంగా మున్సిపల్ మురుగు కాల్వలోకి కెమికల్ వాటర్ వదిలారు. ప్రజలు, చిన్నపిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్





విఠల్‌నగర్ డ్రైనేజీలో పారుతున్న ఆర్ఎఫ్‌సీఎల్ నీరు, వాసన భరించలేక ముక్కుకు గుడ్డలు కట్టుకున్న స్థానికులు

అంజన్న హుండీ ఆదాయం రూ.81లక్షలు

మల్యాల, సెప్టెంబరు 6: కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి దేవ స్థానానికి హుండీల ద్వారా రూ.81, 07,641 నగదు ఆదాయం సమకూరి నట్లు ఈవో ఎం.రామకృష్ణరావు తెలిపారు. 56 రోజులకు గాను ఆలయంలోని 12 అంజన్న హుండీలను విప్పి శుక్రవారం లెక్కించగా నగదుతో పాటు 14గ్రాముల మిశ్రమ బంగారం, 4.900కిలోల మిశ్రమ వెండి, 61విదేశి కరెన్సీ లభించినట్లు ఈవో తెలిపారు. లెక్కింపులో కరీంనగర్ ఏసీ సుప్రియ, ఏఈవో వై అంజయ్య, పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, హరిహరనాథ్ ఆలయ అధికారులు, సిబ్బంది, శ్రీ వేంకటఅన్నమాచార్య సేవా ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



సొమ్ములు లెక్కిస్తున్న సిబ్బంది

కార్పొరేట్ వ్యవసాయ విధానాలపై ఉద్యమించాలి

» తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మిల్కూరి వాసుదేవరెడ్డి

భగత్‌నగర్, సెప్టెంబరు 6: బీజేపీ అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల వ్యవసాయ విధానాలపై ఉద్యమించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. డిజిటలైజేషన్ పేరుతో కార్పొరేట్ల చేతుల్లో వ్యవసాయ రంగాన్ని పెడుతున్నారన్నారు. దీనితో రైతాంగానికి జీవనోపాధికి ముప్పుగా పరిణమించిందన్నారు. దేశంలో అధిక భాగం రైతుల్లో చిన్న, సన్నకారు రైతులు, భూమిలేని కౌలు రైతులు ఉన్నారన్నారు. బడా వ్యాపారవేత్తల డిజిటలైజేషన్‌లో వీరిని కూడా చేర్చినట్లయితే మొత్తంగా వ్యవసాయ ఉత్పత్తులపై కార్పొరేట్ ఆధిపత్యం పెరిగి పోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన వ్యవసాయరంగంలో ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలని డిమాండ్ చేశారు.

మట్టి వినాయక విగ్రహాలను పూజించాలి



మట్టి విగ్రహాలను అందిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి, భాస్కర్

సిరిసిల్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మట్టి వినాయకులను పూజించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సిరిసిల్లలోని మానేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మట్టి వినాయకుల విగ్రహాల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి శుభాకాంక్షలు తెలుపుతూ నవరాత్రి ఉత్సవాల్లో మట్టి విగ్రహాలను వినియోగించుకోవాలని, రసాయనాలతో చేసే విగ్రహాలతో పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుందని అన్నారు. కార్యక్రమంలో మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చింతోజు భాస్కర్, గోదావరి పాలీమర్స్ మేనేజర్ శ్రీకాంత్, డాక్టర్ ఆకాంక్ష, న్యాయవాది శాంతిప్రకాస్ శుక్లా, కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, పట్టణ అధ్యక్షురాలు స్వరూప, నారాయణ, దుర్గాచారి పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, పెద్దూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు మట్టి వినాయకుల ప్రతిమలను తయారు చేశారు. ప్రధానోపాధ్యాయులు నాగుల భాగ్యరేఖ, చక్రవర్తుల రమాదేవి, గణేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాల, వాణీనికేతన్ హైస్కూల్, కందికట్కూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు తయారు చేసిన మట్టి వినాయక విగ్రహాలతో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్‌వీఎస్ భారత్‌గ్యాస్, వాణీనికేతన్ పాఠశాల విద్యార్థులు బస్టాండ్ ప్రాంతంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసగౌడ్, మహేష్‌చంద్ర, ప్రిన్సిపాల్ తూముకుంట శ్రీనిధి, ఉపాధ్యాయులు సదానందం, ప్రదీప్‌రెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నరు.

ముస్తాబాద్: విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు గూడెపు దేవేందర్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక మహర్షి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులు వినాయక చవితి వేడుకలను నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలని కోరారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు, భజరంగ్ దళ్ సభ్యుల తదితరులు పాల్గొన్నారు.


ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో శుక్రవారం మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు అందజేశారు.

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి ముస్లీం విద్యార్థిని మహేక్ శుక్రవారం మట్టితో వినాయకుడి ప్రతిమను తయారు చేసి మతసామరస్యానికి నిదర్శనంగా నిలిచింది. హెచ్‌ఎం మురళీధర్ అభినందించారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు మట్టి విగ్రహాలను తయారుచేసి ప్రతిష్ఠించి ఆదర్శంగా నిలిచారు. మండపల్లికి చెందిన ఇద్దరు చిన్నారులు గాధగోని నిహంత్, త్రినాయ్ ప్రకృతితో కూడిన రావి ఆకులు, బంక మట్టితో సహజ సిద్ధమైన గణపతి విగ్రహాలను తయారు చేశారు.

చేనేత రంగుల నుంచి పదాల అల్లిక వరకు

- సినీ గేయ, రచయిత, కవి, వడ్డేపల్లి కృష్ణ మృతి
- సాహితీ రంగంలో తనదైన ముద్ర



వడ్డెపల్లి కృష్ణ(ఫైల్)



కృష్ణను సన్మానిస్తున్న మాజీ ప్రధాని వాజ్‌పేయ్

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

సినీ గేయ రచయిత, దర్శకుడు, కవి, డాక్టర్ వడ్డెపల్లి కృష్ణ (76) శుక్రవారం ఉదయం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. సిరిసిల్ల చేనేత కుటుంబం నుంచి రంగుల రంగుల వస్త్రాల మధ్య నుంచి పదాల అల్లికలతో, లలిత గీతాలతో మొదలైన సాహిత్య ప్రస్థానం వెండితెర వరకు సాగింది. 1949లో సిరిసిల్ల మధ్యతరగతి చేనేత కుటుంబంలో పుట్టిన ఆయన తెలుగు సాహిత్య రంగంలో తనదైన ముద్రవేసుకున్నారు. తపాలా శాఖలో ఉద్యోగిగా పని చేస్తూనే నిరంతరం రచనలు చేశారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన నేపథ్యంలో జయజయహే తెలంగాణ బాలే నృత్యం రూపకం చేశారు. టీవీ సీరియళ్లు, సినిమాలకు మాటలు కథలను అందించారు. 2005లో 'ఎక్కడికి వెళ్తుందో మనస్సు', 2017లో 'లావణ్య విత్ లవ్‌బాయ్స్' చిత్రాలకు రచన, దర్శకత్వం వహించారు. 2 వేలకు పైగా లలిత గీతాలను అందించారు. ఆడియో ఆల్బమ్స్ వెలువరించారు. పది నాటికలు, సంగీత నృత్య రూపకాలు, టీవీ ఎపిసోడ్‌ల రచనలు, డాక్యుమెంటరీలు అందించారు. జానపద కవులకు పరిమితమైన పుణ్యక్షేత్రాలు, ప్రదేశాలను గుర్తించి సాహిత్య విలువలతో కూడిన సినీగీతాల స్థాయిలో అందించారు. 1991లో వేములవాడ దేవస్థానంపై మొట్టమొదటి ఆడియో క్యాసెట్‌ను వెలువరించారు. కృష్ణను దేవస్థానం వారు గేయ కిరీటి బిరుదుతో సత్కరించారు. సిరిసిల్ల జిల్లా ఆవిర్భావం సందర్భంగా ప్రత్యేక గీతాన్ని రాశారు. వడ్డెపల్లి కృష్ణ తన 20వయేటనే దేశభక్తి గేయం రాయగా 1969లో రేడియోలో ప్రసారమైంది. 1972లో దేశభక్తి గీతంగా ఈ మాసపు పాటగా గుర్తింపు పొందింది. వడ్డెపల్లి కృష్ణ సాహిత్య కృషికి ఎన్నో అవార్డులను అందుకున్నారు. సినీ రంగంలో అక్కినేని నాగేశ్వరావు సొంత చిత్రం పిల్ల జమీందార్ సినిమాతో పాటల ప్రస్థానాన్ని మొదలు పెట్టారు. అమృత కలశం, యుగకర్త, పెద్దరికం, భైరవ ద్వీపం, పిలిస్తే పలుకుతా వంటి సినిమాలకు పాటలు రాశారు.

● ఎన్నో సత్కారాలు అవార్డులు

వడ్డెపల్లి కృష్ణ సాహిత్య కృషికి ఎన్నో అవార్డులను అందుకున్నారు. 2005లో సెన్సార్ బోర్డు సభ్యుడిగా, 2003లో అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవానికి, 2010లో బాలల నంది నాటకాలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. 2006, 2009 నంది అవార్డుల కమిటీకి చైర్మన్‌గా ఉన్నారు. 1987 ముఖ్యమంత్రి ఎన్టీఆర్, 1996 మాజీ ప్రధాని వాజ్‌పేయి చేతుల మీదుగా విశిష్ట కవి సత్కారాలను పొందారు. అప్పటి ముఖ్యమంత్రులు రోశయ్య, చంద్రబాబు నాయుడు, రాజశేఖర్‌రెడ్డి, ఇప్పటి సీఎం రేవంత్‌రెడ్డితో చేతుల మీదుగా సత్కారాలు అందుకున్నారు. చిరుగజ్జెలు, వడ్డెపల్లి గేయవల్లి కావ్యాలకు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం లభించాయి. పూణే బాలభారతి తెలుగు వాచకాల్లో పాఠ్యాంశాలుగా నిలిచాయి. గేయ కిరీటి, లలితశ్రీ, కవనప్రజ్ఞ, కవి శిరోమణి, కళారత్న, జీవన సాఫల్య, లివింగ్ లెజెండ్ బిరుదులు ఉన్నాయి. దేవులపల్లి, దాశరథి, సినారె, తెలుగు యూనివర్సిటీ, పుర స్కారాలను అందుకున్నారు. కృష్ణ 30 గ్రంథాలను వెలువరించారు.

● కవులు రచయితల నివాళి

వడ్డెపల్లి కృష్ణ మృతికి రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మానేరు రచయితల సంఘం, జిల్లా రచయితల సంఘం, సిరిసిల్ల సాహితీ సమితి, తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో కవులు, రచయితలు ఆయన చిత్రపటం వద్ద శుక్రవారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అఖిల భారత తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు ప్రముఖ కవి జూకంటి జగన్నాథం మాట్లాడుతూ రచయిత, బాలసాహితీవేత్త, సినీ గేయరచయితగా వడ్డెపల్లి కృష్ణ ఎనలేని సేవలు అందించారని, సిరిసిల్లలో పుట్టి చేనేత కుటుంబం నుంచి సాహిత్య రంగంలో తనదైన ముద్ర వేశారని కొనియాడారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఎలగొండ రవి, రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ వాసరవేని పర్శరాములు, సిరిసిల్ల సాహితీ సమితి ప్రతినిధి డాక్టర్ జనపాల శంకరయ్య కవులు, రచయితలు వెంగల లక్ష్మణ్, బూరదేవానందం, ఆడెపు లక్ష్మణ్, కోడం నారాయణ, కొక్కుల రాజేశం, గుండెల్లి వంశీ తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల సాహిత్య రంగంలో వడ్డెపల్లి కృష్ణ సేవలు మరువలేనివని, ఆయన మృతి తీరని లోటనే మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కృష్ణ కుటుంబ సభ్యులు, బంధువులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

9న జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 6: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9న సిరిసిల్ల పట్టణం మినీ స్టేడియంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు చిక్కాల రామారావు, ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తెలంగాణ రాష్ట్ర సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 14, 16, 18, 20 సంవత్సరాలు లోపు ఉన్న వారు మాత్రమే అర్హులని తెలిపారు. ఈ పోటీల్లో 100, 200, 400, మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్, జావలిన్ త్రో, లాంగ్ జంప్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 19న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. వివరాలకు 7901464456 నంబరులో సంప్రదించాలని సూచించారు.

అన్నపూర్ణ రిజర్వాయర్‌కు కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 6: ఇల్లంతకుంట మండలం అనంతగిరిలోని అన్న పూర్ణ రిజర్వాయర్‌కు నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామ ర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రసుత్తం 2.95టీఎంసీలకు చేరుకున్నాయి. మధ్యమానే రు ద్వారా వచ్చిన 6400 క్యూసెక్కుల నీటిని రెండు పంపుల ద్వారా ఎత్తిపోస్తుండగా, ఎగువన రంగనాయకసాగర్‌కు 6600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

గవర్నమెంట్ ప్లీడర్‌గా కళ్యాణ చక్రవర్తి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 6 : సిరిసిల్ల జిల్లా కోర్టులో గవర్నమెంట్ ప్లీడర్‌గా సిరిసిల్లకు చెందిన టి.కళ్యాణచక్రవర్తిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. శుక్రవారం కళ్యాణ చక్రవర్తి కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

కొట్టుకుపోయిన కాజ్‌వేను పరిశీలించిన నాయకులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 6: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి -అక్కపల్లి గ్రామాల మధ్య ఉన్న కాజ్ వే, గాలం చెరువు చెరువుకు వెళ్లే మట్టి రోడ్డును కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పరిశీలించారు. మరమ్మతు పనులు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, సుధాకర్, శ్రీనివాస్, సాలయ్య, సత్యనారాయణ, భగవంతరెడ్డి, స్కైలాబ్‌రెడ్డి పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 6: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ అవార్డు అందుకున్న ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గాలిపల్లి కృష్ణహరిని ఆయన స్వగ్రామం లోని రాచర్లబొప్పాపూర్‌లో పద్మశాలి సంఘం సభ్యులు శుక్రవారం సన్మానించారు. ఉత్తమ అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. సంఘం అధ్యక్షుడు భీమేశ్వర్, సభ్యులు మల్లేశం, నందం, శ్రీనివాస్, దేవానందం, సతీష్, పర్శరాములు, నారాయణ, రవి, రాజు, మార్కండేయ, భిక్షపతి, అరవింద్, మునుస్వామి, బాలరాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 6: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని యాంటీ నార్కోటిక్ బ్యూరో సీఐ కృష్ణమూర్తి సూచించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. గంజాయి, మత్తు పదార్థాలతో జీవితాలు అంధకారం చేసుకోవద్దన్నారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. అనంతరం స్థానిక సీఐ శ్రీనివాస్‌గౌడ్ పోక్సో చట్టం, శిక్షలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమాకాంత్, అధ్యాపకులు చంద్రమౌళి, విష్ణుప్రసాద్, సాగర్, భూమక్క, కవిత, గీత తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

గంభీరావుపేట, సెప్టెంబరు 6: గంభీరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం రిలీఫ్ అండ్ చెక్కులను అందజేశారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, సోషల్ మీడియా ఇన్‌చార్జి గౌరీశంకర్ నాయకులు పాల్గొన్నారు.

ఆల్ స్టయిల్స్ మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ అసోసియేషన్

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 6: ఆల్ స్టయిల్స్ మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం వెంకంపేట సాయికృష్ణ ఫంక్షన్ హాల్‌లో ఆల్ అసోసియేషన్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా వడ్నాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ సమీనా, ఉపాధ్యక్షులుగా అక్కనపెల్లి వినోద్, బొల్లోజు శ్రీనివాస్, కోశాధికారిగా నాగుల కనకయ్య, సహాయ కార్యదర్శులుగా ఎలగందుల శ్రీనివాస్, రోహిత్, భాస్కర్, గౌరవ సలహాదారులుగా మామిడాల సమ్మయ్య, తాట్ల వీరేశం, సభ్యులుగా పిట్టల లత, సబ్బని సప్తఋషి ఎన్నికయ్యారు.

రైతులకు మెరుగైన సేవలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 6: రైతులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందిద్దామని ఏఎంసీ చైర్ పర్సన్ ఐరెడ్డి చైతన్యమహేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో శుక్రవారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుందామన్నారు. సమావేశంలో వైస్‌చైర్మన్ ఎలగందుల ప్రసాద్, డైరెక్టర్లు రజనీకాంత్, రాజేశం, తిరుపతి, సురేందర్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, సత్తవ్వ, వెంకటరెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, నర్సింగం, వీరేషం, రాజిరెడ్డి, రాజవీరు, కార్యదర్శి హరినాథ్ పాల్గొన్నారు.

గొర్రెల కాపరి కుటుంబానికి పరామర్శ

ముస్తాబాద్, సెప్టెంబరు 6: మండలంలోని ఆవునూర్ గ్రామంలోని బత్తుల మల్లేశంకు సంబంధించిన గొర్రెలు మృత్యువాత చెందగా సిరిసిల్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ప్రభుత్వం ఆదుకునేలా చూస్తామన్నారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు యాదగిరిగౌడ్, జిల్లా కార్యదర్శి మిరియాల్‌కార్ శ్రీనివాస్, నక్కల నారాయణరెడ్డి, పొన్నాల ఎల్లారెడ్డి, సారగొండ దేవిరెడ్డి, చిన్ని లక్ష్మారెడ్డి, ఎండీ చాంద్‌పాషా ఉన్నారు.

గణేష్ నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు



రాజన్న ఆలయంలో గణేష్ మండపం

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 6: వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం గణేష్ నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఆలయంలోని నాగిరెడ్డి మండపంలో శనివారం గననాథుడు కొలువుదీరనున్నాడు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాట్లు చేస్తున్నారు. గణేష్ మండపాన్ని సిద్ధం చేసి తీరొక్క పూలతో అలంకిరిస్తున్నారు. ఆలయ ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

11 నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడలు

కోనరావుపేట, సెప్టెంబర్ 6 : ఈ నెల 11 నుంచి నిజామాబాద్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఎస్‌జీఎఫ్ క్రీడలను నిర్వహించనున్నట్లు ఎంఈవో దూస రఘుపతి తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ వరకు మండల స్థాయి క్రీడలను నిజామాబాద్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల స్టడీ సర్టిఫికెట్, ఫోన్ నంబర్లతో సహా 9 గంటలకు హాజరు కావాలన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

చందుర్తి, సెప్టెంబరు 6: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ అన్నారు. చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లె, తిమ్మాపూర్, రామన్నపేట అంగన్‌వాడీలో కేంద్రాల్లో శుక్రవారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు మంజుల, గంగజల, మంగాదేవి, మంగ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

చందుర్తి, సెప్టెంబరు 6: చందుర్తి మండలం లింగంపేటలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దప్పుల అశోక్‌కు కూతురు జన్మించి మృతి చెందగా, మూడపల్లి గ్రామంలో జువ్వాడి సత్యనారాయణ రావు, మల్యాల గ్రామంలో సుధమళ్ల రాజనర్సు మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. మాజీ సర్పంచులు చిలుక అంజిబాబు, జువ్వాడి అనిల్ రావు, మాజీ వైస్ ఎంపీపీ అబ్రహం, మాజీ ఎంపీటీసీ రమేష్ రావు, నాయకులు ఉన్నారు.

రేపు జూనియర్ బేస్‌బాల్ జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 6: జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా జూనియర్ బేస్‌బాల్ జట్ల ఎంపిక పోటీలను ఈనెల 8న నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 10 గంటల నుంచి ఎంపిక పోటీలను నిర్వహించనున్నామని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చల్ల హరిశంకర్, ఎండీ యూనుస్‌పాష తెలిపారు.

నిర్ణీత కరెంట్ చార్జీల అమలుకు వినతి

- సీఎంకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి లేఖ

సిరిసిల్ల, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలో అమలు చేస్తున్న ఫార్ములా తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలని, రాష్ట్రంలోని మరమగ్గాల పరిశ్రమకు నిర్ణీత కరెంట్ ఛార్జీలు అమలు చేస్తూ పవర్‌లోడ్‌ను పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఈఆర్‌సీ అధికారులకు శుక్రవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి లేఖ రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా 35,588 పవర్‌లూం ఉండగా సిరిసిల్లలో 25,494 పవర్‌లూం ఉన్నాయని పేర్కొన్నారు. సిరిసిల్లలోని పవర్‌లూం నిర్వాహకులు ప్రస్తుతం ఉన్న పరిమిత పవర్‌లోడ్ సామర్థ్యం పది హెచ్‌పీలు ఉండడంతో అవస్థలు పడుతున్నారని, తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. దీంతో నేత కుటుంబాలు అధిక విద్యుత్ వినియోగం కారాణంగా జీవనోపాధిని కొనసాగించేందుకు ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. పవర్‌లూంపై ఆధారపడిన కార్మికులు కూడా నష్టపోతున్నారని పెరిగిన నిర్వహణ ఖర్చులతో తక్కువ వేతనాలు పొందుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న పవర్‌లూం లోడ్‌ను పది హెచ్‌పీల నుంచి 20 హెచ్‌పీలకు పెంచాలని కోరారు. సిరిసిల్లలోని పవర్‌లూం పరిశ్రమ కుటీర పరిశ్రమగా ప్రత్యేక కేటగిరీగా పరిగణిస్తూ కాంట్రాక్ట్ లోడ్ ప్రతి నెలా కిలోవాట్ రూ.20, మినిమంగా రూ. 30 చార్జీలు ఉంచాలని కోరారు. 20 హెచ్‌పీలకు వరకు కిలోవాట్‌కు రూ.4 నిర్ణయించాలని పేర్కొన్నారు. కర్ణాటక రాష్ట్రంలో 20 హెచ్‌పీల వరకు పవర్‌లోడ్ ఉన్న పవర్‌లూంలకు సబ్సిడీకి అర్హులుగా యూనిట్‌కు రూ.1.25 నిర్ణయించారని, అదే విధంగా కర్ణాటక తరహాలో 20 హెచ్‌పీలకు పెంచడంతోపాటు సిరిసిల్లలో చార్జీలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పరిశ్రమపై అధారపడ్డవారికి ఉపయోగపడుతుందని తెలిపారు.

రవీందర్ మరణం తీరని లోటు



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి

వేములవాడ, సెప్టెంబరు 6: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అంకిత భావంతో పనిచేసిన టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పూరెల్లి రవీందర్ మరణం యూనియన్‌కు తీరని లోటని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి అన్నారు. నూకలమర్రి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి ఇటీవల మృతి చెందిన పూరెళ్ల రవీందర్ సంస్మరణ సభ శుక్రవారం వేములవాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ రవీందర్ పనిచేసిన పాఠశాలలో విద్యార్థుల పట్ల ఎంతో శ్రద్ధ తీసుకుని వారిని, అదే క్రమంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ తరపున నిరంతరం పోరాడారని కొనియాడారు. టీపీటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు హన్మాండ్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమానాథ్‌రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, ఆనందరెడ్డి, అడ్డిక రాజశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అంజన్న, వేములవాడ మండల అర్బన్ అధ్యక్షుడు తిరుపతి, ప్రధాన కార్యదర్శి బొజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి కల్పించాలి



సిరిసిల్లలో మాట్లాడుతున్న మూషం రమేష్

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 6 : సిరిసిల్లలో వస్త్రపరిశ్రమలపై ఆధారపడిన నేతన్నలకు సీఎం రేవంత్‌రెడ్డి ఉపాధి కల్పించాలని, వస్త్ర పరిశ్రమల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని కామ్రేడ్ అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో శుక్రవారం సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. బతుకమ్మ చీరలకు సంబంధించి 10 శాతం యారన్ సబ్సిడీతోపాటు వర్కర్ టూ ఓనర్ పథకం తదితర అంశాలపై చర్చించారు. సీఎం రేవంత్‌రెడ్డికి సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందించాలని నిర్ణయించి సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా మూషం రమేష్ మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో గత తొమ్మిది నెలలుగా నెలకొన్న సంక్షోభంతో ఉపాధి లేక ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ మధ్యకాలంలోనే దాదాపు 12 మంది కార్మికులు ఆత్మహత్య చేసుకొని చనిపోయారన్నారు. సంక్షోభాన్ని నివారించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పును సుప్రీంకోర్టు వెనక్కి తీసుకోవాలి

కోనరావుపేట, సెప్టెంబర్ 6 : ఎస్సీ వర్గీకరణ తీర్పును సుప్రీంకోర్టు వెనక్కి తీసుకోవాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ మండల అధ్యక్షుడు మాందాల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సుద్దాలలో శుక్రవారం ఎస్సీ వర్గీకరణ పోరాట కమిటీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ పోరాట కమిటీ పిల్లల భవిష్యత్ కొరకు ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్ శాతాన్ని పెంచుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణ పోరాట కమిటీ సభ్యులు అంగూరి సుధాకర్, మాసం జనార్ధన్, ఎర్రవెల్లి ప్రశాంత్, ఎరవెల్లి రాజయ్య కాయితి శంకర్, తెగదండి రవీందర్, నీరటి సంజు, ఎగదండి మహిపాల్, టేకుమల్ల కృష్ణ ప్రసాద్, ఎర్రవెల్లి నాగరాజు, నీరటి రవి, ఎర్రవెల్లి కిషన్, మాసం ఆనందం తదితరులు పాల్గొన్నారు.

ఆగయ్య దంపతులకు కేసీఆర్ అభినందన



సన్మానిస్తున్న కేసీఆర్

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 6: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య-హైమావతి దంపతుల వివాహ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మాజీ సీఎం కేసీఆర్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆగయ్య -హైమావతి దంపతులకు కేసీఆర్ శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవితను ఆగయ్య-హైమావతి దంపతులు కలిశారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

వేములవాడ, సెప్టెంబరు 6: వేములవాడ పట్టణం 14 వార్డులోని న్యూ అర్బన్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టై, బెల్టులు, ఐడీ కార్డులను శుక్రవారం పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ సొంత ఖర్చులతో తయారు చేయించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, ఉపాధ్యాయులు శుక్రవారం అందజేశారు. ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

వడ్డేపల్లి కృష్ణ మృతిపై సంతాపం

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 6: ఉమ్మడి జిల్లాకు చెందిన సినీ గేయ, లలిత గీతాల కవి, నృత్య నాటకాల రచయిత వడ్డేపల్లి కృష్ణ మృతి పట్ల జిల్లాకు చెందిన పలువురు కవులు, రచయితలు, కళాకారులు వేరువేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తం చేశారు. సంతాపం తెలిపిన వారిలో డాక్టర్ గంగ్ర లక్ష్మణరావు, నంది శ్రీనివాస్, కొత్త అనిల్‌కుమార్, డాక్టర్ నలిమెల భాస్కర్, నగునూరి శేఖర్, అన్నవరం దేవేందర్, సేనాధిపతి, బూర్ల వేంకటేశ్వర్లు, గాజోజు నాగభూషణం, డాక్టర్ బీవీఎన్ స్వామి, డాక్టర్ నరహరి ఆచార్య పాల్గొన్నారు.

సెల్లార్లను ఎలా ధ్వంసం చేస్తారు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 6: భవన సెల్లార్‌లోని షెటర్లకు కమర్షల్ టాక్స్ కడుతున్నా మున్సిపల్ అధికారులు ఎలా ధ్వంసం చేస్తారని బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు ప్రశ్నించారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓ పార్టీ నాయకుడు ఫిర్యాదు చేశాడని మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్ భవనం సెల్లార్లను కూల్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మంచె శ్రీనివాస్‌కు సంబంధించిన భవనానికి మూడు ఇంటి నంబర్లు ఉన్నాయని అందులో సెల్లార్‌లోని షెటర్లను కమర్షియల్‌గా మార్చుకొని ఏటామున్సిపల్‌కు టాక్స్ కడుతున్నట్లు చెప్పారు. టాక్స్ వసూలు చేస్తున్నా మున్సిపల్ అధికారులు ఓ వ్యక్తి పిర్యాదు చేశాడని షెటర్లను తొలగించడం సరికాదన్నారు. కోర్టు నుంచి కూల్చాలని మున్సిపల్‌కు ఆదేశాల వచ్చాయా అని మున్సిపల్ కమిషనర్‌ను ప్రశ్నిస్తే ఎలాంటి ఉత్తర్వులు రాలేదన్నారని, ఏ విధంగా షెటర్లను తొలగించారని ప్రశ్నించారు. కొత్త ప్రభుత్వానికి అనుకూలంగా పని చేయాలని అనుకోవడం మున్సిపల్ అధికారులకు మంచిది కాదన్నారు. కనీసం రెండు రోజుల సమయం కూడా ఇవ్వకుండా ఆగమేఘాల మీద ధ్వంసం చేయడం సరి కాదన్నారు. ప్రజలు భయాందోళనలకు గురవుతారన్నారు. ఆర్టీఏ చట్టంను అడ్డం పెట్టుకొని బ్లాక్ మెయిల్ చేస్తూన్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ అనే వ్యక్తికి భయపడి అధికారులు సెల్లార్‌లోని షెటర్లను కూల్చడం మంచిది కాదన్నారు. గతంలో పట్టణంలోని దేవాలయానికి సంబంధించిన స్థలాన్ని ఆక్రమించి భవనం నిర్మించాడని 2010లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. బ్లాక్‌మెయిల్స్‌కు పాల్పడే వ్యక్తి ఫిర్యాదు చేస్తే అధికారులు భయపడవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అన్నారపు శ్రీనివాస్, లింగంపల్లి సత్యనారాయణ, బీఆర్‌ఎస్ నాయకులు దార్ల సందీప్, బుర్ర మల్లికార్జున్, పోచవేణి ఎల్లయ్య, ఆకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌వి బురదజల్లే రాజకీయాలు



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 6: సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఎక్కడో కూర్చుండి ఎక్స్ ద్వారా బురదజల్లె రాజకీయాలు చేస్తున్నారని, తుపాకి రాముడిలా మాట్లాడుతున్నారని కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాటాడారు. తెలంగాణలో వర్షాలతో ప్రజలు అనేక ఇబ్బందులు గురయ్యారని, కొందరు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ లోపభూయిష్ట విధానాలతోనే ఇంతటి విపత్తు జరిగినట్లు భావిస్తున్నారన్నారు. సిరిసిల్ల పట్టణంలోని కొన్ని ప్రాంతాల ప్రజలు వర్షం వస్తే అరచేతులో ప్రాణాలను పెట్టుకొని జీవిస్తున్నారన్నారు. ఈసారి కురిసిన వర్షాలతో అప్రమత్తమైన కలెక్టర్, ఎస్పీ, రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సమన్వయంతో అండగా ఉన్నందుకు కాంగ్రెస్ తరపున కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడ పని చేస్తున్నారన్నారు. గతంలో వడగళ్ల వాన వచ్చినప్పుడు అధికారంలో ఉన్న కేసీఆర్ గాలి మోటార్లో వచ్చి ఎకరానికి రూ. 10 వేలు నష్టపరిహారం ఇస్తానని గాలి మాటలు చెప్పి వెళ్లారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వడగళ్ల వానతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10వేలు పరిహారం అందించినట్లు చెప్పారు. ఖమ్మం, మహబూబాద్ జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు క్షేత్ర స్థాయిలో పర్యటించారని, ప్రజల మధ్య ఉండి వారి కోసం పనిచేస్తుంటే బీఆర్‌ఎస్ నాయకుల కంటికి కనబడలేదని అన్నారు. గత ప్రభుత్వంలో ఇరిగేషన్ మంత్రిగా హరీష్‌రావు, మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ చేసిన పని వల్లే ఈ వరదలని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ తొమ్మిదన్నర సంవత్సరాల కాలంలో బావబావమరిది ఫామ్ హౌస్‌ల పేరుతో హైదరాబాద్‌లోని చెరువులు, నాళాలు, కుంటలు కబ్జా చేశారని ఆరోపించారు. ప్రకృతిని కాపాడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైడ్రాను తీసుకొచ్చారన్నారు. లిక్కర్ స్కాంలో తీహార్ జైలుకు వెళ్లిన చెల్లిని బయటకు తీసుకొచ్చేందుకు ఢిల్లీ చుట్టూ తిరిగిన కేటీఆర్ నియోజకవర్గం ప్రజలను మరిచారని విమర్శించారు. సిరిసిల్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకు నూరి బాలరాజు, కాంగ్రెస్ పట్టణ ఉపాధ్యక్షుడు వెంకటేశం, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, ప్రధాన కార్యదర్శి కల్లూరి చందన, పట్టణ అధ్యక్షురాలు వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు ఆడెపు చంద్రకళ, రాగుల జగన్, వెంగళ లక్ష్మీనర్సయ్య, కత్తెర దేవదాస్, ఆడెపు ప్రభాకర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బైరి ప్రభాకర్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ రవీందర్, మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు దేవయ్య, నాయకులు పాల్గొన్నారు.